TG TEL/25/A1234 www.kakatiyanews.com
ఉత్తరం
# కాకతీయ
బుధవారం, 12 ఆగస్టు 2026 | సంపుటి: 01 సంచిక: 364 | పేజీలు: 6 వెల: 5





## పాతబస్తీ మెట్రోకు వేగం పెంచండి!

### ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట రోడ్డు విస్తరణ పూర్తి చేయాలి

- మెట్రో విస్తరణ టెండర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి
- రద్దీకి అనుగుణంగా అదనపు బోగీలు జత చేయాలి
- ఢిల్లీ మెట్రో సాంకేతికతపై అధ్యయనం చేయాలి
- ప్రయాణికుల సౌకర్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి
- ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సును అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో మెట్రో పనులను వేగవంతం చేయాలని, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణతోపాటు మెట్రో విస్తరణకు సంబంధించిన టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని స్పష్టం చేశారు. నగరంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మెట్రో రైళ్లకు అదనపు బోగీలు జత చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

........(తరువాయి 2లో)



## 22ఎ భూములపై ఆందోళన వద్దు

- అర్హులకు న్యాయం చేస్తాం.. ప్రభుత్వ ఆస్తులను కాపాడతాం
- 14లోగా అన్ని డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి
- జెన్యూన్ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి
- సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్..
- ఆన్‌లైన్ వివరాల ఆధారంగానే నిర్ణయాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** నిషేధిత ఆస్తుల జాబితా (పీఓబీ/22ఎ)లో ఉన్న భూముల విషయంలో అర్హులైన వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ''చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో మాత్రం రాజీపడే ప్రసక్తే లేదు'' అని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ అనుమతులు తదితర అన్ని పత్రాలను ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో

........(తరువాయి 2లో)

## రూ.200 కోట్ల భూమి..
# ₹7 కోట్లకేనా?

### టెసరాక్ట్ కంపెనీకి చైర్మన్‌గా సీఎం సోదరుడు కొండల్ రెడ్డి

- ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీకి ఏ లెక్కన భూ కేటాయింపులు
- కర్ణాటకలో ఒక న్యాయం.. తెలంగాణలో మరో న్యాయమా?
- నిజాలు నిగ్గు తేల్చే వరకు బీఆర్ఎస్ పోరాటం సాగుతుంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:**

రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే టెసరాక్ట్ కంపెనీకి కేటాయించారని, ఆ సంస్థకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఒక్క ఉద్యోగి కూడా లేని, రూ.లక్ష మూలధనం ఉన్న కంపెనీకి ఐదెకరాల ప్రభుత్వ భూమిని ఏ ప్రాతిపదికన కేటాయించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి విలువ రూ.200 కోట్లు ఉంటే.. కేవలం రూ.7 కోట్లకు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్య కుటుంబానికి భూమి కేటాయింపు వ్యవహారంపై బీజేపీ ఫిర్యాదు చేసి.. లోకాయుక్త విచారణ వరకు తీసుకెళ్లిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ''కర్ణాటకలో ఒక న్యాయం.. తెలంగాణలో మరో న్యాయమా?'' అని నిలదీశారు. టెసరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడికి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారని ప్రస్తావించిన కేటీఆర్.. కొండల్‌రెడ్డి తన ప్రొఫైల్‌లోనే టెసరాక్ట్ చైర్మన్‌గా పేర్కొన్నారని అన్నారు. ఈ భూకేటాయింపు వ్యవహారంలోని నిజానిజాలు తేలే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**టెసరాక్ట్ ఎవరిది?**

టెసరాక్ట్ కంపెనీ వ్యవహారంపై తాము ఆరా తీసినట్లు కేటీఆర్ తెలిపారు. ఆ సంస్థ ఏరోస్పేస్, డిఫెన్స్ పరికరాల తయారీలో ఉందని చెబుతున్నారని పేర్కొన్నారు. అమెరికా ఎంబసీ ప్రతినిధులతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించిందని, యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ డెవలప్‌మెంట్ ఫోరం ఎగ్జిక్యూటివ్ బోర్డులో కొండల్‌రెడ్డికి సభ్యత్వం ఇచ్చారని చెప్పారు. కొండల్‌రెడ్డి తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో టెసరాక్ట్ కంపెనీకి చైర్మన్‌గా పేర్కొన్నారని కేటీఆర్ అన్నారు. అమెరికా కాన్సులేట్ కూడా కొండల్‌రెడ్డి టెసరాక్ట్

........(తరువాయి 2లో)

## డ్రాగన్ దూకుడుకు భారత్ దీటైన జవాబు!

- అరుణాచల్ భారత్‌లో అంతర్భాగమే
- పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవం మారదు
- ఎల్‌ఏసీ వెంట శాంతి, ప్రశాంతతే కీలకం
- పీఓకే పరిణామాలపై నిఘా.. పాక్‌ను బాధ్యుడిని చేయాలని జైస్వాల్ పిలుపు



2



## ఇసుక రీచ్‌లలో అక్రమ వసూళ్లు ఆపాలి

- రూ.15,650 డీడీ చెల్లించినా రూ.3–4 వేల అదనపు వసూళ్లు
- వేధిస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి
- అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలి
- ఇసుక లారీ యజమానుల సంఘాల ఆందోళన
- 3 రోజుల్లో చర్యలు తీసుకుంటామని టీజీఎండీసీ ఎండీ హామీ

4

## సొంత సర్కారుపైనే పోచారం గుర్రు!

- సీఎం హామీ ఇచ్చినా పనులు కదలడం లేదని అసంతృప్తి
- మంత్రులు ప్రజాప్రతినిధుల ఫోన్లు కూడా ఎత్తడం లేదు
- వేం నరేందర్‌రెడ్డికి 50 సార్లు ఫోన్ చేసినా స్పందించలేదని వ్యాఖ్య
- పొంగులేటి, భట్టిలు సీఎం ఆదేశాలను పట్టించుకోవడం లేదని ఆరోపణ
- నియోజకవర్గ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తానని హెచ్చరిక
- కాంగ్రెస్‌లో చేరినా ఇబ్బందులు తప్పడం లేదంటున్న సీనియర్ నేత



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో మరోసారి అసంతృప్తి స్వరం బహిర్గతమైంది. సీనియర్ నేత, బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సొంత ప్రభుత్వంపైనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా హామీ ఇచ్చినా నియోజకవర్గ సమస్యలు పరిష్కారం కావడం లేదని, సీఎం ఆదేశాలను మంత్రులే పట్టించుకోవడం లేదని బహిరంగంగా విమర్శించారు. మంత్రులు ప్రజాప్రతినిధుల ఫోన్లు కూడా ఎత్తడం

........(తరువాయి 2లో)



## కరెన్సీలో కొత్త నోట్లు!

- రూ.10, రూ.20 పాలిమర్ నోట్లకు కేంద్రం ఓకే
- తొలి దశలో రూ.200 కోట్ల నోట్లతో ప్రయోగం
- ఆర్బీఐ ప్రతిపాదనకు కేంద్ర ఆమోదం
- ఎప్పటి నుంచి చలామణిలోకి వస్తాయనేదానిపై ఇంకా స్పష్టత లేదు
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

2




# సొంత సర్కారుపైనే పోచారం గుర్రు!

(మొదటిపేజీ తరువాయి)

లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి మాటకే విలువ లేకపోతే ప్రభుత్వం ఎలా నడుస్తోందో అర్థం కావడం లేదన్న రీతిలో ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాను కాంగ్రెస్‌లో చేరానని పోచారం స్పష్టం చేశారు. బాన్సువాడలో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ ఆరు నెలల్లో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా హామీ ఇవ్వడం వల్లే తాను కాంగ్రెస్‌లో చేరానని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి సమయం గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం స్వయంగా నిధులు మంజూరు చేయాలని మంత్రులకు సూచించినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్నానని పోచారం ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

**50 సార్లు ఫోన్ చేసినా..**

ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి తాను సుమారు 50 సార్లు ఫోన్ చేసినా స్పందించలేదని పోచారం చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా సీఎం చెప్పిన విషయాలను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. "మంత్రులు ప్రజాప్రతినిధుల ఫోన్లు కూడా ఎత్తడం లేదు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గ సమస్యలను ఎలా పరిష్కరించాలి?" అన్నట్లుగా ఆయన వ్యక్తం చేసిన అసంతృప్తి అధికార పార్టీలో చర్చకు దారితీసింది. సొంత ప్రభుత్వంలోనే నిధుల విడుదల కోసం ఇంతగా ఇబ్బంది పడాల్సి వస్తోందని ఆయన వాపోయారు. సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులకు నిధుల విడుదల విషయంలో పోచారం గతంలోనూ ప్రభుత్వంపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక మంత్రికి 20 సార్లు చెప్పినా పని జరగలేదని, నిధుల కోసం ఈ వయసులో మంత్రుల కాళ్లు మొక్కాలా? అంటూ అప్పట్లో ఘాటుగా ప్రశ్నించారు. తాజాగా మరోసారి అదే తరహాలో ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఇంటి వద్దకే జీవోలు వచ్చేవని, ప్రస్తుతం ఎమ్మెల్యేలు తమ సమస్యలపై అధికారులను, మంత్రులను సంప్రదించేందుకు ఇబ్బందులు పడుతున్నారని పోచారం వ్యాఖ్యానించినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వంలో సమన్వయం లోపించిందా? సీఎం ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదా? అన్న చర్చ మొదలైంది.





**పార్టీ మారినా సమస్యలు తప్పలేదా?**

2024 జూన్ 21న సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో పాటు కుమారుడు భాస్కర్‌రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన పోచారం.. తెలంగాణ ఏర్పడిన తొలి రోజుల్లో కేసీఆర్ మంత్రివర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018లో బాన్సువాడ నుంచి గెలిచి శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2023లో మరోసారి బీఆర్ఎస్ తరఫున విజయం సాధించారు. అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పిన సీనియర్ నేత.. ఇప్పుడు సొంత ప్రభుత్వంపైనే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం కాంగ్రెస్‌లో చర్చకు కారణమైంది.

**సీఎం మాటకు విలువ లేదా?**

పోచారం తాజా వ్యాఖ్యలు కేవలం నియోజకవర్గ సమస్యలకే పరిమితమా? లేక ప్రభుత్వంలో నెలకొన్న సమన్వయ లోపాన్ని బయటపెట్టే సంకేతమా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన పనులు కదలకపోవడం, మంత్రులు స్పందించకపోవడం, అధికారుల వద్ద కూడా సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ఆయన బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం అధికార పార్టీకి ఇబ్బందికర పరిణామంగా మారింది. బాన్సువాడ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని పోచారం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తానన్న హెచ్చరిక కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సీనియర్ నేతగా పోచారం చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రులు ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అధికార పార్టీలోని అంతర్గత సమన్వయంపై మరోసారి చర్చకు తెరలేపిన పోచారం వ్యాఖ్యలు రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో చూడాలి.

# రూ.200 కోట్ల భూమి.. రూ.7 కోట్లకేనా?

(మొదటిపేజీ తరువాయి)

చైర్మన్ అని పేర్కొందని తెలిపారు. ఈ నేపథ్యంలో సంస్థకు, సీఎం కుటుంబానికి ఉన్న సంబంధాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెసరాక్ట్ కంపెనీకి సంబంధించిన పలు వివరాలను కేటీఆర్ ప్రస్తావించారు. 2025 మార్చి 31న కంపెనీ చేసిన ప్రకటనలో తమ సంస్థలో ఒక్క ఉద్యోగి కూడా లేరని పేర్కొన్నట్లు తెలిపారు. కంపెనీ మూలధనం కేవలం రూ.లక్ష మాత్రమేనని అన్నారు. అలాంటి సంస్థకు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకు కేటాయించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. భూమి కేటాయింపునకు ముందు సంస్థ ఆర్థిక సామర్థ్యం, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, ఉత్పత్తి సామర్థ్యం వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించిందా? భూమి కేటాయింపునకు అనుసరించిన విధానమేంటి? అన్న వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

**కుటుంబ సభ్యుల చుట్టూ కాంట్రాక్టులు, భూములా?**

ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఇతర వ్యవహారాలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మరో సోదరుడు అనుముల జగదీశ్‌రెడ్డి అమెరికాలో ఉంటారని.. సీఎం అమెరికా పర్యటన సందర్భంగా 'స్వచ్ఛ బయో' అనే సంస్థతో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులకు సంబంధించిన అవగాహన ఒప్పందం కుదిరిందని తెలిపారు. ఆ సంస్థకు ఎక్కడ భూములు కేటాయించారో తవ్వి తీస్తామని అన్నారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టు దక్కిందని కేటీఆర్ ఆరోపించారు. సింగరేణిలోనూ ఆయన కనుసన్నల్లోనే వ్యవహారాలు సాగుతున్నాయని విమర్శించారు. సైట్ విజిట్ సర్టిఫికెట్లు, ఇతర కుంభకోణాలకు సంబంధించిన అంశాలను గతంలో బీఆర్ఎస్ బయటపెట్టిందని.. ఆ పరంపరలోనే టెసరాక్ట్ భూకేటాయింపు వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు.

**"కర్ణాటకలో ఒక న్యాయం.. ఇక్కడ మరో న్యాయమా?"**

కర్ణాటకలో మాజీ సీఎం సిద్ధరామయ్య సతీమణికి మూడు ఎకరాల భూమి కేటాయింపు వ్యవహారంపై బీజేపీ ఫిర్యాదు చేసిందని కేటీఆర్ తెలిపారు. ఆ వ్యవహారం లోకాయుక్త విచారణకు వెళ్లి.. చివరకు సిద్ధరామయ్య రాజీనామా చేసే పరిస్థితి వచ్చిందని అన్నారు. అలాంటప్పుడు తెలంగాణలో సీఎం సోదరుడితో సంబంధం ఉందని తాము ఆరోపిస్తున్న కంపెనీకి భారీ విలువైన ప్రభుత్వ భూమి కేటాయిస్తే ప్రశ్నించకూడదా? అని నిలదీశారు. "పక్క రాష్ట్రంలో ఒక న్యాయం.. తెలంగాణలో మరో న్యాయమా?" అని ప్రశ్నించారు. టెసరాక్ట్ కంపెనీకి, ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. అయితే కంపెనీ చైర్మన్‌గా కొండల్‌రెడ్డి తన ప్రొఫైల్‌లోనే పేర్కొన్నారని గుర్తుచేశారు. ఈ వ్యవహారం మంత్రి శాఖ పరిధిలోనే జరిగిందా? మంత్రికి పూర్తి సమాచారం ఉందా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులైతే ప్రభుత్వ భూములు, కాంట్రాక్టులు పొందేందుకు ప్రత్యేక నిబంధనలు వర్తిస్తాయా? అని కేటీఆర్ నిలదీశారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి ఎలాంటి అధికారిక హోదా ఉందో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. "టెసరాక్ట్ కథేంటో తేల్చేదాకా వదిలిపెట్టం. భూకేటాయింపులో ఎవరి పాత్ర ఉంది? ఏ ప్రాతిపదికన భూమి ఇచ్చారు? సంస్థ సామర్థ్యాన్ని ఎలా నిర్ధారించారు? అన్నది తేలాలి" అని కేటీఆర్ అన్నారు. అయితే కేటీఆర్ చేసిన ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వం, టెసరాక్ట్ సంస్థ, సంబంధిత వ్యక్తుల అధికారిక వివరణ వెలువడితేనే భూకేటాయింపు వ్యవహారంపై పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# డ్రాగన్ దూకుడుకు భారత్ దీటైన జవాబు!

- అరుణాచల్ భారత్‌లో అంతర్భాగమే
- పేర్లు మార్చినంత మాత్రాన వాస్తవం మారదు
- ఎల్ఏసీ వెంట శాంతి, ప్రశాంతతే కీలకం
- పీఓకే పరిణామాలపై నిఘా.. పాక్‌ను బాధ్యుడిని చేయాలని పిలుపు

**న్యూఢిల్లీ:** అరుణాచల్‌ప్రదేశ్‌పై హక్కు ఉన్నట్లు చూపించేందుకు చైనా మరోసారి చేస్తున్న ప్రయత్నాలపై భారత్ ఘాటుగా స్పందించింది. రాష్ట్రంలోని ప్రాంతాలకు పేర్లు మార్చడం ద్వారా వాస్తవాలను మార్చలేరని స్పష్టం చేసింది. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో విడదీయరాని అంతర్భాగమని, ఈ వాస్తవాన్ని ఎవరూ మార్చలేరని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. ఎల్ఏసీ వెంట శాంతి, ప్రశాంతతలను కొనసాగించడమే భారత్‌చైనా సంబంధాల్లో అత్యంత కీలకమని పేర్కొంది. సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతాయని స్పష్టం చేసింది. అరుణాచల్‌ప్రదేశ్‌ను చైనా 'జాంగ్‌నాన్'గా పేర్కొంటూ అక్కడి ప్రాంతాలకు కొత్త పేర్లు పెట్టడం కొనసాగిస్తోంది. 2017లో ఆరు ప్రాంతాలకు పేర్లు పెట్టిన చైనా.. 2021లో మరో 15 ప్రాంతాలకు, 2023లో 11 ప్రాంతాలకు పేర్లు ప్రకటించింది. తాజాగా మరోసారి ఇలాంటి ప్రయత్నాలు చేయడంపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది. అరుణాచల్‌ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమన్న విషయంలో ఎలాంటి సందేహానికి తావులేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. పేర్లు మార్చడం వల్ల భౌగోళిక వాస్తవాలు మారబోవని తేల్చిచెప్పారు.

**ఎల్ఏసీపై అప్రమత్తం**

అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో చైనా దళాలు చొరబడ్డాయన్న వార్తల నేపథ్యంలోనూ విదేశాంగ శాఖ స్పందించింది. భారత్‌చైనా సరిహద్దు సమస్యలను అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని జైస్వాల్ తెలిపారు. ఎల్ఏసీ వెంట శాంతి, ప్రశాంతతలను కొనసాగించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆగస్టు 6న భారత్‌చైనా సరిహద్దు వ్యవహారాలపై జరిగిన చర్చల్లో ఎల్ఏసీ వెంబడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉన్న దౌత్య మార్గాలను కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు వివరించారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో చోటుచేసుకుంటున్న పరిణామాలను భారత్ నిశితంగా గమనిస్తోందని జైస్వాల్ తెలిపారు. ఒకవైపు చైనా సరిహద్దు ఎత్తుగడలకు స్పష్టమైన సమాధానం ఇస్తూనే.. మరోవైపు అమెరికా, బంగ్లాదేశ్‌తో దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్ ముందుకు సాగుతున్నట్లు విదేశాంగ శాఖ తాజా వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

# కరెన్సీలో కొత్త నోట్లు!

**కాకతీయ, నేషనల్ డెస్క్ :** దేశంలో కరెన్సీ నోట్ల రూపంలో మార్పునకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రూ.10, రూ.20 విలువైన పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపింది. తొలిదశలో ఒక్కో విలువకు 100 కోట్ల చొప్పున మొత్తం 200 కోట్ల పాలిమర్ నోట్లను ముద్రించి ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర బోర్డు సిఫార్సుల మేరకు పాలిమర్ నోట్లపై ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఆర్బీఐ చట్టం1934లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను కేంద్రానికి సమర్పించింది. రూ.10, రూ.20 డినామినేషన్లలో 100 కోట్ల చొప్పున పాలిమర్ నోట్లను ముద్రించి క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా చలామణి చేయాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. దీనికి కేంద్రం ఆమోదం తెలిపినట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

**కాగితపు నోట్లు కొనసాగుతాయి**

పాలిమర్ నోట్లు అందుబాటులోకి వచ్చినంత మాత్రాన ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను పూర్తిగా ఉపసంహరించబోమని కేంద్రం స్పష్టం చేసింది. రెండు రకాల నోట్లు కొంతకాలం చలామణిలో ఉండనున్నాయి. పాలిమర్ నోట్ల ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్తులో వాటి వినియోగాన్ని విస్తరించే అవకాశం ఉంది. అయితే పాలిమర్ నోట్ల కొనుగోలు ప్రక్రియ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని ఆర్బీఐ కేంద్రానికి తెలిపింది. దీంతో ఫీల్డ్ ట్రయల్స్ ఎప్పుడు మొదలవుతాయి? సాధారణ చలామణిలోకి పాలిమర్ నోట్లు ఎప్పటి నుంచి వస్తాయి? అన్నదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ ప్రక్రియకు అయ్యే వ్యయాన్ని కూడా ఇప్పుడే అంచనా వేయలేమని పేర్కొన్నారు. మరోవైపు దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గినట్లు కేంద్రం వెల్లడించింది. వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా నమోదైన సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 2023 24లో 5.4 శాతం ఉండగా.. 202425లో 4.6 శాతానికి, 202526లో 2.1 శాతానికి తగ్గిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అయితే 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 3.9 శాతానికి పెరిగిందన్నారు. పశ్చిమాసియా సంక్షోభం, అంతర్జాతీయ ఇంధన ధరలు, కూరగాయల ధరల పెరుగుదల, ఎల్‌నినో పరిస్థితులు ఇందుకు కారణమని వివరించారు. అయినప్పటికీ ఆర్బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యానికి దిగువనే ఉందని తెలిపారు.



**జీఎస్టీ రేట్లలో మార్పులు**

ధరల ఒత్తిడిని తగ్గించేందుకు జీఎస్టీ రేట్లలోనూ మార్పులు చేసినట్లు కేంద్రం తెలిపింది. 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో 18 శాతం స్టాండర్డ్ రేటు, 5 శాతం మెరిట్ రేటును నిర్ణయించగా.. ఎంపిక చేసిన వస్తువులు, సేవలకు 40 శాతం ప్రత్యేక డీమెరిట్ రేటును తీసుకొచ్చినట్లు నిర్మలా సీతారామన్ వివరించారు. గతంలో 28 శాతం జీఎస్టీ ఉన్న అనేక వస్తువులను 18 శాతానికి తగ్గించామని, 18 శాతం ఉన్న కొన్ని వస్తువులపై పన్నును 12 లేదా 5 శాతానికి తగ్గించినట్లు చెప్పారు. 12 శాతం పన్ను ఉన్న మరికొన్ని వస్తువులపై 5 శాతం లేదా సున్నా పన్ను విధించినట్లు వెల్లడించారు. దేశీయ తయారీని ప్రోత్సహించడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, ఎగుమతుల పోటీతత్వాన్ని పెంచడం లక్ష్యంగా పలు వస్తువులపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని సవరించినట్లు కేంద్రం తెలిపింది. 2026-27 బడ్జెట్‌లో ప్రకటించిన ఈ మార్పులు ఫిబ్రవరి 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. అత్యవసర వస్తువుల ధరలపై ఒత్తిడిని తగ్గించేందుకు క్రూడ్ పామ్ ఆయిల్, క్రూడ్ సోయాబీన్ ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని తగ్గించినట్లు వెల్లడించింది. మసూర్ పప్పుపై అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను తగ్గించినట్లు తెలిపింది. 2026 మార్చిలో పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.10 చొప్పున తగ్గించినట్లు ఆర్థిక మంత్రి రాజ్యసభకు వివరించారు.

# 22ఎ భూములపై ఆందోళన వద్దు



(మొదటిపేజీ తరువాయి)

ఉన్న వివరాల ఆధారంగానే సబ్ రిజిస్ట్రార్లు నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి 22ఎ/పీఓబీ అంశంపై సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రజావాణి, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

**పత్రాలన్నీ ఆన్‌లైన్‌లోకి**

భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, జీవోలు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ అనుమతులు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ఈనెల 14వ తేదీలోగా అన్ని డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. దీంతో రిజిస్ట్రేషన్ సమయంలో సంబంధిత పత్రాలను సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుందని, ఫోర్జరీ డాక్యుమెంట్లకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ఏది అసలైన పత్రమో.. ఏది బోగస్ డాక్యుమెంటో గుర్తించేందుకు అదనపు పరిశీలనకు అవకాశం ఉంటుందని చెప్పారు. మరింత పారదర్శకత కోసం పహాణీలను కూడా సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులో ఉంచే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**దరఖాస్తులపై రోజువారీ సమీక్ష**

పీఓబీకి సంబంధించిన దరఖాస్తులను కేసులవారీగా పరిశీలించాలని మంత్రి సూచించారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏవి నిజమైనవో గుర్తించి.. అర్హమైన వాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. "సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే.. సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉంది. పీఓబీ దరఖాస్తులను కేస్ బై కేస్ ప్రతిరోజూ సమీక్షించాలి. 22ఎ పేరుతో ఉద్దేశపూర్వకంగా పేదలు, అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు" అని మంత్రి హెచ్చరించారు.

**సబ్ రిజిస్ట్రార్లకు పరిమిత అధికారాలు**

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలించి వాటి ఆధారంగానే నిర్ణయాలు తీసుకునేలా వారి అధికారాలను పరిమితం చేయాలని ఆదేశించారు. పీఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించకూడదని సూచించారు. ఏదైనా రిజిస్ట్రేషన్ తిరస్కరించాల్సి వస్తే మూడు రోజుల సమయం తీసుకుని.. అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు కలెక్టర్ లేదా ఐజీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

**పీఓబీ దరఖాస్తులు నేరుగా కలెక్టర్‌కే**

పీఓబీకి సంబంధించి వచ్చే ప్రతి దరఖాస్తును ఇకపై తహసీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కు పంపించాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్ నుంచి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌కు, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుంచి కలెక్టర్‌కు మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేలా వ్యవస్థను మార్చాలని సూచించారు. గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవని.. ప్రస్తుతం వాటిని సమీకృతం చేయడంతో కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపించి మొత్తం రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. తాజాగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన వారికి న్యాయం చేయడంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని మంత్రి తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే విషయంలో ఏమాత్రం రాజీపడబోమని స్పష్టం చేశారు. "ఏ చిన్న తప్పు చేసినా క్షమించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం" అని అధికారులను హెచ్చరించారు. పీఓబీ పేరుతో అర్హులకు ఇబ్బందులు కలిగించకుండా, అదే సమయంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**సబ్ రిజిస్ట్రార్లకు నేటి నుంచే దిశానిర్దేశం**

నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో అదే రోజు సాయంత్రంలోగా సమావేశం నిర్వహించాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని మంత్రి ఆదేశించారు. ఉన్నతస్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి వివరించి తక్షణమే అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

# పాతబస్తీ మెట్రోకు వేగం పెంచండి!

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

**పనుల్లో జాప్యం వద్దు**

పాతబస్తీ మెట్రో విస్తరణకు అవసరమైన పనులను సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట మార్గంలోని రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, మెట్రో నిర్మాణానికి సంబంధించిన తదుపరి ప్రక్రియను ఆలస్యం చేయకుండా ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రజా రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెట్రో విస్తరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో రైళ్లకు పెరుగుతున్న ఆదరణతో ప్రయాణికుల రద్దీ కూడా పెరుగుతోందని సీఎం పేర్కొన్నారు. రద్దీకి అనుగుణంగా అదనపు బోగీలను అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా రైళ్ల సామర్థ్యం, సర్వీసుల నిర్వహణ, స్టేషన్లలో సౌకర్యాలను మెరుగుపరచాలని ఆదేశించారు.



**ఢిల్లీ మెట్రో సాంకేతికతపై అధ్యయనం**

మెట్రో నిర్మాణం, నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఢిల్లీ మెట్రోలో అమలవుతున్న ఆధునిక సాంకేతిక విధానాలను అధ్యయనం చేసి, అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగించి మెట్రో సేవలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని చెప్పారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో మెట్రో రైలు కీలక పాత్ర పోషిస్తుందని సీఎం పేర్కొన్నారు. ప్రజలు వ్యక్తిగత వాహనాలపై ఆధారపడకుండా ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. మెట్రో విస్తరణతోపాటు రోడ్ల అభివృద్ధి, ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను సమన్వయంతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

**ఇన్వెస్ట్ తెలంగాణపై సమీక్ష**

సమీక్షలో డిసెంబరులో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపైనా సీఎం చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వివిధ వ్యాపార రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గత ఏడాది నిర్వహించిన సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడుల వివరాలను సమీక్షించిన సీఎం.. మరింత పెట్టుబడులు సాధించేలా కొత్త ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు రామకృష్ణరావు, సీఎస్ సంజయ్ జాజు, హెచ్ఎంఆర్ఎల్ అధికారులు ఎన్వీఎస్ రెడ్డి, సర్ఫరాజ్ అహ్మద్, అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా మండలానికి పోలీస్ స్టేషన్ కావాలి

- ఏర్పాటు చేయకుంటే సీఎం పర్యటన అడ్డుకుంటాం
- నడికూడ మండలం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- నాలుగు గ్రామ పంచాయతీలు ఇతర స్టేషన్ల పరిధిలోనే
- అత్యవసర సమయాల్లో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా. పగడాల కాళీ ప్రసాద్‌రావు

**కాకతీయ, పరకాల:** నడికూడ మండల కేంద్రంలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయకుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాల పర్యటనను అడ్డుకుంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్‌రావు హెచ్చరించారు. మండల ప్రజల భద్రత, మహిళల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం వెంటనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నడికూడ మండల కేంద్రంలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు ఎరుకల దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో కాళీ ప్రసాద్‌రావు, జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు. రెండువేల పద్దెనిమిదిలో నడికూడ మండలం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మండలంపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

**నాలుగు గ్రామాలు ఇతర స్టేషన్ల పరిధిలోనే**

కంటాత్మకూర్, కౌకొండ, రామకృష్ణాపూర్, సర్వాపూర్ గ్రామ పంచాయతీలు ఇప్పటికీ ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలో కొనసాగుతున్నాయని కాళీ ప్రసాద్‌రావు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు చిన్న ఫిర్యాదుల కోసం సైతం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసు సేవలు సకాలంలో అందక మహిళలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ప్రజా పోరాటం కొనసాగిస్తామని కాళీ ప్రసాద్‌రావు హెచ్చరించారు. ధర్నా కొనసాగుతున్న సమయంలో పరకాల సీఐ ఫోన్‌లో ఆయనతో మాట్లాడి, నడికూడలో పూర్తిస్థాయి పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బీజేపీ నాయకులు ధర్నాను విరమించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తీగల భరత్‌గౌడ్, తిప్పారపు సుధీర్, దండు సురేష్, అరణ్యరెడ్డి, గోనెల కోటేశ్వర్, బాణాల శ్రీనివాస్, దొగ్గల వంశీ, మేకల నరేష్, గోగుల రాజిరెడ్డి, శ్రీరాం రెడ్డి, రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌టీపీని వెంటనే పునరుద్ధరించాలి

- 300 కేఎల్‌డీ ప్లాంట్ చాలాకాలంగా నిరుపయోగం
- టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి
- నగరంలో ప్రతి వీధిలో అవెన్యూ ప్లాంటేషన్
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న
- బాలసముద్రం ఎస్‌టీపీని పరిశీలించిన కమిషనర్
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** నగర పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. బాలసముద్రంలోని 300 కేఎల్‌డీ సామర్థ్యం గల సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా ప్లాంట్‌ను వెంటనే పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. బాలసముద్రం రెండు పడకల గదుల సముదాయంలో ఉన్న ఈ ప్లాంట్ చాలాకాలంగా పనిచేయడం లేదని అధికారులు కమిషనర్‌కు వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ అవసరమైన టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణలో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల పాత్ర కీలకమని, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.

**పచ్చదనంపై ప్రత్యేక దృష్టి**

అనంతరం 59వ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన అవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. స్థానిక కాలనీ ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. నగరంలో పచ్చదనం పెంచేందుకు ప్రతి వీధిలోనూ అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని సూచించారు. మొక్కల సంరక్షణలో ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేందర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పందన తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇనుగుర్తి మండల కాంగ్రెస్‌లో అసంతృప్తి

- మండల అధ్యక్ష పదవిపై గాంధీభవన్‌లో వినతి
- స్థానిక నాయకుడికే అవకాశం ఇవ్వాలని డిమాండ్
- ఎమ్మెల్యే తీరుపై అధిష్ఠానానికి ఫిర్యాదు
- పార్టీ కోసం పనిచేసిన వారికి అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి
- సామాజిక సమతుల్యత పాటించాలని కోరిన నాయకులు



**కాకతీయ, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపిక విషయంలో స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని కాంగ్రెస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్ష పదవిని ఇనుగుర్తి టౌన్‌కు చెందిన నాయకుడికి కేటాయించాలని కోరుతూ మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ ఉపాధ్యక్షుడు, గాంధీభవన్ ఇన్‌చార్జి కుమార్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తమ్మడపల్లి కుమార్, దిశ కమిటీ సభ్యుడు గుజ్జునూరి బాబురావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ఇనుగుర్తి మండలంపై చూపిస్తున్న వివక్షతను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యేను, పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించేందుకు ఇనుగుర్తి టౌన్ నాయకులు, కార్యకర్తలు కష్టపడ్డారని పేర్కొన్నారు. గతంలో మండల పార్టీ అధ్యక్ష పదవిని విలీన గ్రామానికి చెందిన నాయకుడికి ఇచ్చారని, ఈసారి ఇనుగుర్తి టౌన్‌కు అవకాశం కల్పించాలని కోరినా తమ అభ్యర్థనను పట్టించుకోకుండా ఇతర గ్రామానికి చెందిన వ్యక్తికి అవకాశం కల్పించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. టౌన్ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అసహనం పెరుగుతోందన్నారు.

**సామాజిక సమతుల్యత పాటించాలి**

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మూడు మండలాల పార్టీ అధ్యక్ష పదవులను ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం పట్ల ఇతర సామాజిక వర్గాలు, దళిత వర్గాల్లో ఆవేదన వ్యక్తమవుతోందన్నారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న కార్యకర్తల మనోభావాలను గౌరవించి ఇనుగుర్తి మండల కాంగ్రెస్ విషయంలో సముచిత నిర్ణయం తీసుకోవాలని పీసీసీ అధ్యక్షుడిని కోరినట్లు తెలిపారు. ఇనుగుర్తి టౌన్ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగేలా మండల అధ్యక్ష పదవి విషయంలో నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో చిన్నల కట్టయ్య, మార్కెట్ డైరెక్టర్ కొట్టం రాము, దేవులపల్లి వెంకన్న, వొల్లంల మురళి, పరుపాటి రవీందర్‌రెడ్డి, కొలిపాక నారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మహంకాళి సలీం, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్, బూర ఇస్తారి, గుజనూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాళోజీ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు సన్మానం

**కాకతీయ, వరంగల్:** కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జె. వెంకటేశ్వర్‌రావును హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) వరంగల్ 'టీమ్ ఇగ్నైట్' ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి, పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి ఆర్థోపెడిక్స్ విభాగాధిపతిగా 1998-2024 వరకు సేవలందించిన డాక్టర్ వెంకటేశ్వర్‌రావు.. యాదాద్రి భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, జయశంకర్ భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆయన అనుభవం



విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహదపడుతుందని హెచ్ఆర్‌డీఏ ప్రతినిధులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్లు వి. నరేష్‌కుమార్, కె. వెంకటస్వామి, ఎస్. శిరీష్‌కుమార్, ఎం. దిలీప్‌కుమార్, శివ్వా సృజన్, వి. ప్రవీణ్‌కుమార్, జి. రాజేశ్వర్‌రెడ్డి, బన్నా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్ వేగం పెంచాలి

- పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనపై స్పష్టత ఇవ్వాలి
- స్థానిక యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు కల్పించాలి
- మహిళలు, ఎస్సీలు, ఎస్టీలకు తగిన ప్రాధాన్యం
- పార్క్ అభివృద్ధి పురోగతిపై లోక్‌సభలో ప్రశ్న
- వరంగల్‌ను జాతీయ జౌళి హబ్‌గా తీర్చిదిద్దాలి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** వరంగల్ పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ప్రకటించిన లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన వేగంగా పెరగాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య అన్నారు. స్థానిక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా నాణ్యమైన ఉద్యోగాలు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ అమలు పురోగతిపై డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భూసేకరణ, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, ఉత్పత్తి ప్రారంభం, ఉద్యోగాల కల్పనపై వివరాలు వెల్లడించాలని కోరారు. ముఖ్యంగా స్థానిక యువత, మహిళలు, ఎస్సీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు ఎన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయో స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరిటా సమాధానమిస్తూ దేశవ్యాప్తంగా 7 పీఎం మిత్ర పార్కులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో తెలంగాణలోని వరంగల్‌ను ఒక ప్రాంతంగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వరంగల్ పార్క్‌ను బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరీలో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**పెట్టుబడులు, ఉద్యోగాలపై ప్రత్యేక దృష్టి**

కేంద్రం సమాధానంపై డా. కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ పీఎం మిత్ర పార్క్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టుగా కాకుండా తెలంగాణలోనే అతిపెద్ద ఉపాధి, పెట్టుబడుల కేంద్రంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. పార్క్‌లో మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బలహీన వర్గాలకు తగిన ప్రాధాన్యం కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. వరంగల్‌ను జాతీయ స్థాయి జౌళి హబ్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# పీహెచ్‌సీల్లో వైద్య సేవలు మెరుగుపరచాలి

- సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- డ్రై డే యాక్టివిటీలు క్రమం తప్పకుండా నిర్వహించాలి
- అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలి
- వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. రాజారెడ్డి సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పీహెచ్‌సీల పరిధిలో డ్రై డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం దుగ్గొండి, నల్లబెల్లి, బానోజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో వైద్య, ఫార్మసీ సేవలతో పాటు జాతీయ ఆరోగ్య కార్యక్రమాల రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ, పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు.

**జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష**

ఈ సందర్భంగా డా. రాజారెడ్డి మాట్లాడుతూ అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో మెరుగైన పనితీరు కనబరచాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని తెలిపారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో డ్రై డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర మందులను అన్ని ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు.



ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న మానవ వనరులు, మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సమన్వయంతో, సమయపాలనతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

# జనసేనలోకి కరాటే ప్రభాకర్

- కాంగ్రెస్ పార్టీలో 30 ఏళ్లు కృషి చేసినా గుర్తింపు లేదు
- వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మూడు ముక్కలాట
- పదవులను సినిమా టికెట్లలా పంచుకుంటున్నారు
- పవన్ కళ్యాణ్ సిద్ధాంతం నచ్చి జనసేనలో చేరాను
- మీడియా సమావేశంలో కరాటే ప్రభాకర్ వెల్లడి




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీలో మూడు దశాబ్దాలుగా పనిచేసినా తగిన గౌరవం, గుర్తింపు లభించలేదని ఆరోపిస్తూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు కరాటే ప్రభాకర్ రాజీనామా చేశారు. మంగళవారం వరంగల్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్‌ను వీడి జనసేన పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మూడు ముక్కలాటగా మారిందని ఆయన విమర్శించారు. కరాటే ప్రభాకర్ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేశానని తెలిపారు. పార్టీ అధికారంలో లేని సమయంలోనూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పార్టీ బలోపేతానికి కృషి చేశానన్నారు. అయినప్పటికీ ప్రస్తుతం పార్టీలో కష్టపడిన వారికి సరైన గుర్తింపు, గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి మూడు ముక్కలాటగా మారిపోయిందని ఆరోపించారు.

## పదవుల పంపకం సినిమా టికెట్లలా..

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి పదవి ఇచ్చినా కనీస గౌరవం, గుర్తింపు లేకుండా కొందరు వ్యవహరిస్తున్నారని కరాటే ప్రభాకర్ ఆరోపించారు. తూర్పు నియోజకవర్గంలో వచ్చిన పదవులను 'నీకు ఒకటి.. నాకు ఒకటి' అన్న చందంగా సినిమా టికెట్ల మాదిరిగా పంచుకుంటున్నారని విమర్శించారు. తనను కూడా ఎన్నో విధాలుగా ఒత్తిళ్లకు గురిచేశారని, పార్టీ కోసం కష్టపడిన వారికి విలువ లేకుండా పోయిందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జనసేనలో చేరే అవకాశం ఉందని కరాటే ప్రభాకర్ తెలిపారు. తాను పవన్ కళ్యాణ్ కోసం మాత్రమే జనసేనలోకి రాలేదని స్పష్టం చేశారు. పేదలకు మంచి చేయాలనే పవన్ కళ్యాణ్ దృక్పథం, సిద్ధాంతం నచ్చడంతోనే జనసేనలో చేరుతున్నానని పేర్కొన్నారు. జనసేన అధిష్ఠానం ఏ విధంగా ఆదేశిస్తే ఆ విధంగా పనిచేస్తానని, పేద ప్రజల అభివృద్ధి కోసం తన శక్తి మేరకు కృషి చేస్తానని కరాటే ప్రభాకర్ తెలిపారు.

# శ్రీరామ హృదయ కలశం ఊరేగింపు

**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరామ హృదయ కలశం ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారి 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన సన్నిధి నుంచి కలశాన్ని ఏటూరునాగారానికి తీసుకొచ్చినట్లు రామాలయ కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్ తెలిపారు. భక్తులు కలశాన్ని తాకి నమస్కరించుకునే అవకాశం కల్పించారు. అనంతరం ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా భక్తులు 'జై శ్రీరామ్' నినాదాలతో భజనలు చేశారు. లోకకల్యాణం, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కత్తెర శ్రీనివాస్, దీనబాంధవస్వామి, అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వరరావు శర్మ, పర్వతాల ప్రవీణ్, జూపాక పవన్ తదితరులు పాల్గొన్నారు.

# దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే

**కాకతీయ, పెద్దవంగర:** మండలంలోని కోరిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంగు మురళి తల్లి రంగు వినోద దశదినకర్మకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి హాజరయ్యారు. వినోద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మురళి కుటుంబ సభ్యులను పరామర్శించి, కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు సంకెపల్లి రవీందర్‌రెడ్డి, వెంకన్న నాయక్, వేణు, రమేష్, శ్రీనివాస్, శ్యామ్, సతీష్, గోపాల్ నాయక్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కష్టాలకు తావుండొద్దు

- గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరానే లక్ష్యం
- మైలారంలో రూ.9 లక్షలతో ప్రత్యేక విద్యుత్ లైన్ ప్రారంభం
- రైతులు, ప్రజలకు మెరుగైన సరఫరా అందించాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

**కాకతీయ, రాయపర్తి :** పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. ప్రజలకు విద్యుత్ కష్టాలు లేకుండా నిరంతర సరఫరా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాయపర్తి మండలం మైలారం గ్రామంలో గృహ వినియోగం, గ్రామీణ అవసరాల కోసం రూ.9 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రత్యేక విద్యుత్ లైన్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి విద్యుత్ కష్టాలు తలెత్తకుండా ప్రత్యేక విద్యుత్ లైన్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. మైలారం గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్ అందుబాటులోకి రావడంతో గ్రామ ప్రజలతో పాటు రైతాంగానికి మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**మౌలిక వసతులకు ప్రాధాన్యం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని యశస్విని రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు కావడంతో విద్యుత్ సమస్యల నుంచి విముక్తి లభిస్తుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉల్లెంగల నర్సయ్య ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, హామ్యా నాయక్, సర్పంచ్ చిర్ర వేణు, చెవ్వు కాశీనాథం, బొమ్మెర కళ్యాణ్, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కారం కావు.. సమావేశాలు ఎందుకు?

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు లేవు
- కాలువల పూడికతో చివరి ఆయకట్టుకు అందని నీరు
- మూడు నెలలకోసారి సమావేశం.. పరిష్కారాలు మాత్రం శూన్యం
- పెద్దవంగర మండల అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల అసహనం

**కాకతీయ, పెద్దవంగర:** సమస్యలు పరిష్కారం కానప్పుడు సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం ఎందుకని పలువురు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశాలకు పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కావడం లేదని, వచ్చినా గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలకు పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



పెద్దవంగర రైతు వేదికలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు శాఖల అధికారులను సమస్యలపై నిలదీశారు. బొమ్మకల్, వడ్డెకొత్తపల్లి గ్రామాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు లేవని ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదని తెలిపారు. కిష్టు తండాలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

**రోడ్లు, తాగునీటిపై చర్చ**

పలు ప్రాంతాల్లో తాగునీరు, సైడ్ డ్రైనేజీల సమస్యలు ఉన్నాయని ప్రజాప్రతినిధులు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. రహదారులు, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి పలు రోడ్లు మంజూరైనట్లు ఆయా శాఖల అధికారులు వివరించారు. ఎస్సారెస్పీ కాలువలో పూడిక పేరుకుపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని ఉపసర్పంచ్ సీతారాం సమావేశంలో ప్రస్తావించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరగా, ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారి సమాధానం ఇచ్చారు. ప్రతి రైతు పంట మార్పిడి విధానాన్ని పాటించాలని మండల వ్యవసాయ అధికారి స్వామినాయక్ సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పీఆర్ఏఈ దయాకర్, ఏఓ స్వామినాయక్, నీటి పారుదల శాఖ ఏఈ, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

**కాకతీయ, పరకాల:** ఈ నెల 16న పరకాలలో సీఎం ఎ. రేవంత్‌రెడ్డి పాల్గొనే సభకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో కలిసి మంగళవారం ప్రతిపాదిత హెలిప్యాడ్, సభా వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, రూట్‌మ్యాప్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



నూతన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. సభకు భారీగా ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్, పార్కింగ్‌కు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. హెలిప్యాడ్, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు కలెక్టర్ రవి, డీఆర్డీఓ మేన శ్రీను, ఏసీపీ సతీష్‌బాబు, సీఐ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

- సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రతి బూత్‌ను పటిష్ఠం చేయాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి
- పెంబర్తిలో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీ సమావేశం

**కాకతీయ, హనుమకొండ:** గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు హసన్‌పర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్. అశోక్, పార్టీ గ్రామ ఇన్‌చార్జి ఈర్ల చిన్ని సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నూతనంగా ఏర్పాటైన గ్రామ కమిటీ సభ్యులను ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అభినందించారు. గ్రామంలోని ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీకి మరింత బలం చేకూర్చాలని పిలుపునిచ్చారు.

**సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో గ్రామ కమిటీల పాత్ర కీలకమని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళలు, యువత, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాల కోసం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీకి బలమైన పునాది ఉంటేనే కాంగ్రెస్ మరింత బలోపేతం అవుతుందని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన కమిటీ సభ్యులు ప్రతి బూత్‌ను పటిష్ఠం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, నూతన గ్రామ కమిటీ సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# రాయంగా.. రాయంగా!

- శివనగరు శుభఘడియలు!! కదిలిన గ్రేటర్ కార్పొరేషన్ మురికి కాల్వల్లో పాకురు తొలగింపు అధ్వాన స్థితిని వెలుగులోకి తెచ్చిన కాకతీయ పత్రిక
- చెత్తాచెదారం తీసేసిన పారిశుధ్య సిబ్బంది
- ఎట్టకేలకు రెండు వారాలకు స్పందించిన జీడబ్ల్యూఎంసీ

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటి ఆవరణలో చెత్తాచెదారం నిల్వ లేకుండా చూసుకోవాలని పదేపదే ప్రచారం చేసే వరంగల్ మహానగర పాలక సంస్థ ఉద్యోగులు, అధికారులు.. బల్దియా పరిధిలో చేపట్టాల్సిన మురికి కాల్వల పరిశుభ్రతను విస్మరించింది. ఫలితంగా శివనగర్ ఏరియాలో మురికి కాల్వలు దరిద్రంగా మారిపోయాయి. పాకురు పట్టి చూడడానికి అసహ్యంగా కనిపించాయి. ఈ అధ్వాన పరిస్థితులను, అపరిశుభ్ర వాతావరణాన్ని 'కాకతీయ' దినపత్రిక చిత్రాలతో ప్రచురించింది. ఎట్టకేలకు మంగళవారం వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారుల్లో చలనం కలిగింది. పారిశుధ్య సిబ్బందిని శివనగర్ కు పంపించింది. మురికి కాల్వల పరిశుభ్రతకు చర్యలు చేపట్టింది.



**రెండు సార్లు రాస్తే గానీ..!**

మతిమరుపు కలిగిన వ్యక్తులకు ఏ విషయమైనా ఒకటికి రెండుసార్లు చెప్పితే గానీ స్పందించరని అందరికీ తెలుసు. అదేకోవలో అధికారులు కూడా వ్యవహరించడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. శివనగర్ ఏరియాలో మురికి కాల్వలు అపరిశుభ్రంగా ఉన్నాయని కాకతీయ దినపత్రిక రెండు సార్లు కథనాలు రాస్తేగానీ గ్రేటర్ వరంగల్ బల్దియా అధికారుల్లో చలనం రాకపోవడం విస్మయం కలిగిస్తోంది. 14 వందల మంది కార్మికులతో నగరంలో పారిశుధ్య పనులు చేపడుతున్నామని చెబుతున్న అధికారులు... శివనగర్ ను ఎందుకు విస్మరించారో? సిబ్బంది సరిపోవడం లేదా? నగరంలోని ప్రధాన వీధులు పరిశుభ్రంగా ఉంటే సరిపోతుందా? అధికారులే సెలవివ్వాలి. ఇప్పటికైనా అధికారులు నిత్యం మురికికాల్వలను పరిశుభ్రం చేసేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యతను గుర్తుంచుకోవాలి. ఇక ఎన్నో నెలలుగా మురికి కాల్వల్లో పేరుకున్న చెత్తాచెదారాన్ని తొలగించడం పట్ల శివనగర్ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని నెలలకైనా మున్సిపల్ అధికారులు స్పందించడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

# భూ రీ సర్వేతో భూధార్ కార్డు

- డిజిటల్ మ్యాప్‌తో భూముల వివరాల నమోదు
- రైతుల సమక్షంలోనే హద్దుల నిర్ధారణ
- సర్వే పూర్తయిన వెంటనే విస్తీర్ణం వివరాలు
- లోపాలు, వ్యత్యాసాలకు శాశ్వత పరిష్కారం
- భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గుతాయి
- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**కాకతీయ, ఖమ్మం టౌన్ :** భూ రీ సర్వేతో రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డుల్లోని లోపాలను పారదర్శకంగా పరిష్కరించడమే ప్రభుత్వ ఉద్దేశమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న రీ సర్వే అనంతరం ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్‌తో కూడిన భూధార్ కార్డు అందుతుందని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని బేతుపల్లి, నారాయణపురం, గంగారం గ్రామాల్లో కొనసాగుతున్న భూ రీ సర్వేను మంగళవారం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గంగారం గ్రామంలో పంట పొలాల్లో రైతుల సమక్షంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు.



**రైతుల సమక్షంలోనే హద్దుల నిర్ధారణ**

బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గంగారం, బేతుపల్లి, నారాయణపురం, రామగోవిందపురం, ఎం.వి.పాలెం, రామనగర్, పాకాలగూడెం గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో రీ సర్వే కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. పది బృందాలతో ఇప్పటివరకు నాలుగు వేల ఎకరాల్లో సర్వే పూర్తయిందన్నారు. రైతులకు 48 గంటల ముందుగానే నోటీసులు ఇచ్చి, వారి సమక్షంలోనే భూములను కొలుస్తామని చెప్పారు. పక్క భూముల రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకపోవడం, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లోని విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న భూమికి తేడాలు ఉండటం వంటి సమస్యలను రీ సర్వేతో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. సర్వే పూర్తయిన వెంటనే నమోదైన విస్తీర్ణాన్ని రైతులకు అక్కడికక్కడే తెలియజేస్తామన్నారు. గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసు బోర్డులపై ఉంచుతామని చెప్పారు. అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామన్నారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని దివాకర టీఎస్ తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణ, గ్రామ సర్పంచులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# మేకల తండాలో కాంగ్రెస్‌లో చేరికలు

**కాకతీయ, కారేపల్లి:** కారేపల్లి మండలం మేకలతండాలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతోందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు భూక్యా సాములు, బీజేపీ నాయకుడు భూక్యా సురేష్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలకు తావులేకుండా ఐక్యంగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కొత్తగా చేరిన వారికి సముచిత గౌరవం, ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, కబీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సైకి చిన్ననాగారం ఉపసర్పంచ్ సన్మానం



**కాకతీయ, ఇనుగుర్తి :** ఇనుగుర్తి మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పి. నరేష్‌ను చిన్ననాగారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు, ఉపసర్పంచ్ తుమ్మనపల్లి సతీష్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

# భూమి వివాదంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

**తాడూరులో దర్యాప్తు చేపట్టిన హుస్నాబాద్ ఏసీపీ**

**కాకతీయ, చేర్యాల :** మండలంలోని తాడూరు గ్రామానికి చెందిన చింతల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో భాగంగా మంగళవారం హుస్నాబాద్ ఏసీపీ సదానందం తాడూరు గ్రామానికి వచ్చి దర్యాప్తు చేపట్టారు.తనకు సంబంధించిన భూమిని తన అనుమతి లేకుండా అక్రమంగా దున్నించడంతో పాటు, భూమిలో ఉన్న చెట్లను ధ్వంసం చేశారని చింతల లక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా తన భూమిని ఇతరులకు విక్రయించాలని ఒత్తిడి చేస్తున్నారని ఆమె ఆరోపించారు.ఈ ఫిర్యాదు ఆధారంగా రేఖ, నగేష్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా హుస్నాబాద్ ఏసీపీ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితురాలు మరియు సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలను సేకరించారు.కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



**కాకతీయ, చందుర్తి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. పోతురాజుల వేషధారణలో విద్యార్థులు చేసిన విన్యాసాలు, డప్పు చప్పుళ్లకు అనుగుణంగా చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రజిత మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను భావితరాలకు తెలియజేసేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ అసోసియేషన్ కార్యవర్గానికి అభినందనలు


- విజయం సాధించిన సిబ్బందికి పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుభాకాంక్షలు
- పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా పనిచేయాలి
- సిబ్బంది సంక్షేమానికి అంకితభావంతో కృషి చేయాలి



**కాకతీయ, ఖమ్మం బ్యూరో :** ఖమ్మం పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించి నూతన కార్యవర్గంగా ఎన్నికైన పోలీసు అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు. నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా నూతన కార్యవర్గ సభ్యులు వ్యవహరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గం : అధ్యక్షుడు: బి. హేమనాథ్, ఉపాధ్యక్షులు: కె. జగదీష్, వి. సురేష్, కార్యదర్శి: బి. వీరభద్రం, సంయుక్త కార్యదర్శి: కె. సుధాకర్, నిర్వహణ కార్యదర్శి: బి. అప్పారావు, కోశాధికారి: టి. నరసింహరావు, ఈసీ సభ్యులు : వై. వెంకటేశ్వర్లు, వి. హరికృష్ణ, కె. సురేష్, టి. జమలయ్య, ఎన్. ఎడుకొండలు, టి. రేణుక. ఈ కార్యక్రమంలో ఏసీపీ సాంబరాజు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్ పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం డ్రమ్ములు అందజేత

**కాకతీయ, తుంగతుర్తి:** తాను చిన్ననాడు ఓనమాలు నేర్చిన వెంపటి ప్రాథమిక పాఠశాలకు మాజీ ఉపసర్పంచ్ భాష బోయిన వెంకన్న చేయూత అందించారు. తన తల్లిదండ్రులు భాష బోయిన అంజయ్య–ఉప్పలమ్మ జ్ఞాపకార్థం డ్రమ్ములను గ్రామస్తుల చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బివనపల్లి శ్రీనివాస్‌కు అందజేశారు. తాను ఎదగడానికి పునాది వేసిన పాఠశాలకు తిరిగి సహాయం చేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రార్థనలు, జాతీయ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలకు డ్రమ్ములు ఉపయోగపడనున్నాయి. భవిష్యత్తులోనూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దాసరి మంజుల రామచంద్రు, వార్డు సభ్యుడు పులిగుజ్జ నరసయ్య, మాజీ సర్పంచ్ అబ్బగాని సత్యనారాయణ గౌడ్, మాదరబోయిన రవి, సూదగాని రాజయ్య, సగ్గం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# పత్తి కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి

- రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలి
- 15–30 రోజుల్లో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించాలి
- మానిటరింగ్ కమిటీల్లో రైతులకు చోటు కల్పించాలి
- కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ సరళీకరణ
- ఎంఎస్‌పీ కంటే తక్కువకు అమ్మే పరిస్థితి రావొద్దు
- అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు
- వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**కాకతీయ, తెలంగాణ బ్యూరో / ఖమ్మం :** 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర అందేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పత్తి కొనుగోళ్లలో మధ్యవర్తుల జోక్యానికి అవకాశం ఇవ్వొద్దని, గత సీజన్లలో చోటుచేసుకున్న లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో సీసీఐ అధికారులతో పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. "మనం బతకాలంటే రైతు బతకాలి" అన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకుని పనిచేయాలని తుమ్మల అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.

**25.85 లక్షల టన్నుల దిగుబడి అంచనా**

2026-27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, దాదాపు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. లాంగ్ స్టేపుల్ కాటన్‌కు కేంద్రం ఈసారి క్వింటాల్‌కు రూ.8,667 ఎంఎస్‌పీ ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని వివరించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు ఎంఎస్‌పీ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఎంఎస్‌పీ కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి రాకూడదని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్-1 నుంచి ఎల్-12 వరకు అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ప్రారంభించాలని, 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు అందుబాటులోకి వచ్చేలా చూడాలని అన్నారు.

**131 సీసీఐ కేంద్రాలు**

గత సీజన్‌లో 122గా ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఈసారి 131కు పెంచినట్లు తుమ్మల తెలిపారు. అన్ని కేంద్రాలను పూర్తి స్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైతే అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు గ్రామాలు, మండలాలను అనుసంధానం చేసి రైతులు ఎక్కువ దూరం వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేసే మానిటరింగ్ కమిటీల్లో రైతు ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుల వద్ద రద్దీని క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం 6 గంటల తర్వాత కూడా కొనుగోళ్ల సమయాన్ని పొడిగించాలని చెప్పారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు.

**స్లాట్ బుకింగ్ సులభతరం చేయాలి**

కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్లు తెరిచే ముందు జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు రైతులకు విస్తృత ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేయాలని, ఒక రైతు లేదా మొబైల్ నంబర్‌కు అవసరమైన విధంగా మల్టిపుల్ బార్‌కోడ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పంట బుకింగ్ డేటాను ఎన్ఐసీ ద్వారా కపాస్ కిసాన్ యాప్‌కు వేగంగా బదిలీ చేయాలని, రాష్ట్ర సగటు దిగుబడిని ప్రకటించి దానికంటే అధిక దిగుబడి సాధించిన రైతులకు ఏఈవోల ద్వారా డిజిటల్ యీల్డ్ సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. పత్తి అధికంగా ఉత్పత్తి అయ్యే జిల్లాల్లో అవసరమైన మేరకు కాటన్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో స్టేపుల్ లెంగ్త్, మైక్రోనెయిర్, తేమశాతం తదితర నాణ్యత ప్రమాణాలను పరీక్షించే పరికరాలు తప్పనిసరిగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని, తూకం యంత్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు.

**ఫిర్యాదులకు ప్రత్యేక హెల్ప్‌లైన్**

రైతులకు ఎంఎస్‌పీ, కొనుగోలు కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు, స్లాట్ బుకింగ్‌పై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని తుమ్మల అన్నారు. రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను వినియోగించుకునేలా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. "రైతుకు ఎంఎస్‌పీ అందించడమే ప్రధాన లక్ష్యం. ఈ విషయంలో ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగితే తీవ్రంగా పరిగణిస్తాం. రైతుకు నష్టం కలిగించే చర్యలు, అవకతవకలు చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, సీసీఐ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి పత్తి రైతుకు ఎంఎస్‌పీ ప్రయోజనం అందేలా చూడాలని ఆదేశించారు.

# ఇసుక రీచ్‌లలో అక్రమ వసూళ్లు ఆపాలి

- రూ.15,650 డీడీ చెల్లించినా రూ.3–4 వేల అదనపు వసూళ్లు
- వేధిస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి
- అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరపాలి
- ఇసుక లారీ యజమానుల సంఘాల ఆందోళన
- మూడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని టీజీఎండీసీ ఎండీ హామీ

**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** అధికారికంగా నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించినా ఇసుక రీచ్‌లలో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ లారీ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ వసూళ్లను అరికట్టాలని డిమాండ్ చేస్తూ జంట నగరాలకు చెందిన వివిధ ఇసుక లారీ యజమానుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. లారీ యజమానులు, సంఘాల నాయకుల ఆరోపణల ప్రకారం.. ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.15,650 డీడీ చెల్లించి అధికారిక ప్రక్రియ పూర్తి చేసుకున్న లారీల నుంచి కూడా కాంట్రాక్టర్లు అదనంగా రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. అదనపు మొత్తం చెల్లిస్తేనే లోడింగ్ చేస్తామని, లేకపోతే లోడింగ్ చేయబోమంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. రీచ్‌లలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై టీజీఎండీసీ ఇన్‌చార్జిలు, ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణపైనా లారీ యజమానుల సంఘాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. అక్రమ వసూళ్లను అడ్డుకోవాల్సిన కొందరు అధికారులు కాంట్రాక్టర్లకు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారికంగా చెల్లించాల్సిన మొత్తం ఎంత? అదనంగా వసూలు చేస్తున్న మొత్తానికి అనుమతి ఉందా? అనే అంశాలపై టీజీఎండీసీ అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి**

నిబంధనలకు విరుద్ధంగా అదనపు వసూళ్లకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై సమగ్ర విచారణ జరిపించాలని లారీ యజమానులు కోరారు. అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. రీచ్‌లలో పారదర్శకమైన లోడింగ్ విధానం అమలు చేయడంతో పాటు పటిష్ఠమైన అధికారుల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఆరోపణలకు తావులేకుండా పూర్తి స్థాయిలో పారదర్శకత తీసుకురావాలని కోరారు. అదనపు డబ్బులు చెల్లించేందుకు నిరాకరించిన డ్రైవర్లపై కాంట్రాక్టర్లకు చెందిన వ్యక్తులు దాడులకు పాల్పడుతున్నారని లారీ యజమానులు ఆరోపించారు. ఈ ఘటనలపై కూడా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రీచ్‌ల వద్ద డ్రైవర్లకు భద్రత కల్పించాలని కోరారు.

**3రోజుల్లో చర్యలు : టీజీఎండీసీ ఎండీ**

ధర్నా నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకుని వివిధ లారీ యజమానుల సంఘాల ప్రతినిధులతో టీజీఎండీసీ ఎండీతో చర్చలు జరిపించారు. ఇసుక రీచ్‌లలో జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్న అక్రమ వసూళ్లు, అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకుంటామని, మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎండీ హామీ ఇచ్చినట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఎండీ హామీతో ప్రస్తుతానికి ధర్నాను విరమించారు. అయితే మూడు రోజుల్లోగా అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట వేయకపోతే అన్ని లారీ యజమానుల సంఘాలతో సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ధర్నాలో ఆటోనగర్ ఇసుక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడు సుర్విరాజుగౌడ్, పెద్ద అంబర్‌పేట్ ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలగోని భాస్కర్‌గౌడ్, కొత్తపేట అధ్యక్షుడు నర్రి వెంకన్న, చక్రిపురం అధ్యక్షుడు బలవంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీను, కాసుల జంగయ్యగౌడ్ తదితరులతో పాటు జంట నగరాలకు చెందిన వివిధ ఇసుక లారీ యజమానులు, డ్రైవర్లు వందల సంఖ్యలో పాల్గొన్నారు.